సాక్షి నిజామాబాద్

సోమవారం ♦ 12 ♦ మే ♦ 2025



పెన్షన్ ఉద్యోగుల..

పెన్షన్ ఉద్యోగుల ప్రాథమిక హక్కు అని ఇన్సూరెన్స్ ఉద్యోగుల జాతీయ నాయకుడు తిరుపతయ్య పేర్కొన్నారు.

- 8లో ▶



దశాబ్దాల తర్వాత..

జిల్లాలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు నిర్వహించారు.

- 8లో ▶

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
41.9 /22.2

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఎప్‌సెట్‌లో ఉత్తమ ర్యాంకులు

- నారాయణ కళాశాల విద్యార్థిని రియాకు 319
- ప్రతిభచాటిన ఎస్ఆర్, కాకతీయ విద్యార్థులు


రియా(319)

నిజామాబాద్‌అర్బన్: టీజీ ఎప్‌సెట్ ఫలితాలు ఆదివారం వెలువడగా, ఇంజినీరింగ్, అగ్రికల్చరల్ విభాగాల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఇంజినీరింగ్ విభాగంలో నగరంలోని నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థిని పంచమహల్కర్ రియా 319వ ర్యాంకు సాధించింది. అగ్రికల్చర్ విభాగంలో ఎస్ఆర్ కళాశాలకు చెందిన కార్తీక్ 572, విష్ణువర్ధన్ 689వ ర్యాంకులు సాధించారు. అలాగే ఉత్తమ ప్రతిభచాటిన కాకతీయ కళాశాల విద్యార్థులను సంస్థ డైరెక్టర్ రామోజీరావు ఘనంగా సన్మానించారు.

పెళ్లి పత్రికకు షష్టి పూర్తి

60 ఏళ్లనాటి పోచారం లగ్నపత్రిక



బాన్సువాడ రూరల్: రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి వైవాహిక జీవితంలోకి అడుగిడి అరవై ఏళ్లవుతోంది. 1965 మే 12న బాన్సువాడ మండలంలోని ఇబ్రాహీంపేట్‌కు చెందిన పుష్పవతితో ఆయన వివాహం జరిగింది. కాగా వీరి పెళ్లి పత్రికను పోచారం శ్రీనివాస్‌రెడ్డి బావమరిది ఇబ్రాహీంపేట్ మాజీ సర్పంచ్ మాలెపు నారాయణరెడ్డి ఫ్రేం కట్టించి భద్రపరచుకున్నారు.

గిరిజన గురుకులాల్లో ఇంటర్ అడ్మిషన్లు

- 15న కామారెడ్డిలో బాలురకు, 16న చేగుంటలో బాలికలకు కౌన్సిలింగ్
- ఆర్‌సీవో గంగారాం నాయక్

ఇందల్వాయి : రీజియన్ పరిధిలోని మెదక్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలలోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో 2025 -26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ ఎస్ గంగారాం నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్, చేగుంట, నర్సాపూర్, కోనాపూర్, ఎల్లారెడ్డి, హన్మాజీపేట, ఇందల్వాయి బాలికల జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ సీట్లు, నర్సాపూర్‌లో సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. కొడిపల్లి, నాగిరెడ్డిపేట, చీమన్‌పల్లి బాలుర జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ సీట్లు, బాన్సువాడలో సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. మొదట గిరిజన సంక్షేమ గురుకులాల్లో చదివిన విద్యార్థులతో సీట్లు భర్తీ చేశామని, మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 15న కామారెడ్డిలో బాలురకు, 16న చేగుంటలో బాలికలకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఉదయం 10 గంటలకు కౌన్సిలింగ్ కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని తెలిపారు.



30 కిలోల మీనం

ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో ఓ మత్స్యకారుడి వలకు బొచ్చ రకానికి చెందిన 30 కిలోల భారీ చేప చిక్కింది. డొంకేశ్వర్ మండలం చిన్నయానం గ్రామానికి చెందిన కొంతమంది మత్స్యకారులు ఆదివారం గోదావరిలో చేపల వేటకు వెళ్లారు. భరత్ అనే మత్స్యకారుడికి భారీ చేప చిక్కింది. దీనిని వ్యాపారులకు విక్రయించాడు. ప్రతి వేసవిలో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ తగ్గి 20 నుంచి 30 కిలోల పైబడిన చేపలు మత్స్యకారులకు చిక్కుతున్నాయి.

– డొంకేశ్వర్(ఆర్మూర్)



అందాల కనువిందు

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రాంతం ప్రకృతి అందాలతో కనువిందు చేస్తోంది. ఆ దృశ్యాలను సందర్శకులు కెమెరాల్లో బంధిస్తున్నారు. ఎండల తీవ్రతకు ప్రాజెక్టు నీటి మట్టం తగ్గిపోవడంతో పచ్చికబయళ్లు ఏర్పడ్డాయి. ఎటు చూసినా పచ్చని తివాచీ పరిచినట్లుగా కనిపిస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆహ్లాదకర వాతావరణం ఉంటోంది. సూర్యోదయం, సూర్యాస్తమయం దృశ్యాలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. వీటికి తోడు పక్షుల కిలకిలారావాలు, జింకల సందడిని చూస్తే వేరే లోకానికి వచ్చామా అన్నట్లుగా అనిపిస్తుంది. ముంపు నుంచి తేలిన ఎత్తయిన తాటి చెట్లు, నీటి కొలనులు, జల సవ్వడులు, వివిధ వర్ణాల్లో కనిపించే ఆకాశం, ఆకట్టుకునే చెట్ల ఆకృతి, గుంపులుగా తిరిగే పక్షులు మనసును పులకరింపజేస్తున్నాయి. ఈ ప్రకృతి సుందర దృశ్యాలు డొంకేశ్వర్ మండలం జీజీ నడ్కుడ, గాదేపల్లి, చిన్నయానం, అన్నారం, సిర్పూర్ పరిధిలో ఉన్న ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో 'సాక్షి' కెమెరాలో తీసింది. – డొంకేశ్వర్(ఆర్మూర్)

మరిన్ని దృశ్యాలు 8లో..

భూమి పూజ ఎన్నడో?

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ మైదానంలో ఎనిమిది ట్రాక్‌లతో సింథటిక్ క్రీడా మైదానం నిర్మిస్తాం. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పనులకు శంకుస్థాపన చేయిస్తాం. – శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి

నిజామాబాద్ నగరం మధ్యలో ఉన్న క్రీడా ప్రాంగణ స్థలాన్ని గత ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు అమ్మాలని చూసింది. నాయకులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పోరాటం చేయడంతో ఈ రోజు స్టేడియం నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. – ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

గతేడాది నవంబర్ 30వ తేదీన జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానాన్ని పరిశీలించిన సందర్భంలో శివసేనారెడ్డి, షబ్బీర్ అలీ మాటలివి.



- కలగానే జిల్లా కేంద్రంలో స్టేడియం నిర్మాణం
- ప్రజాప్రతినిధులు చొరవ చూపాలంటున్న క్రీడాకారులు

నిజామాబాద్ నాగారం: నిజామాబాద్‌ను క్రీడల హబ్‌గా తీర్చిదిద్దు కోవడంతోపాటు ఒలింపిక్ స్థాయి ప్రమాణాలతో క్రీడా అకాడమీలు ఏర్పాటు చేసుకుందామని రాష్ట్ర ప్రభుత్వంలోని ముఖ్యులు ప్రకటించడంతో క్రీడాకారులు, క్రీడాభిమానుల్లో ఆశలు చిగురించాయి. గత ప్రభుత్వం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానాన్ని కూల్చివేయాలని భావించగా సీనియర్ క్రీడాకారులు అడ్డుకున్నారు. ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి ఈ మైదానంలో క్రీడాకారులతో కలిసి పుట్ బాల్ ఆడటం, ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో స్టేడియం నిర్మాణంపై ప్రకటనలు రావడంతో ఇక స్టేడియం నిర్మాణమే మిగిలింది అనుకున్నారు. గతేడాది అక్టోబర్‌లోనే స్టేడియం నిర్మాణ పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారని ప్రకటించినప్పటికీ ఆ దిశగా ఇప్పటికీ అడుగులు పడలేదు. సరైన సౌకర్యాలు, కోచ్‌లు లేకున్నా జిల్లాకు చెందిన అనేక మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. అన్నిరకాల సదుపాయాలతో నూతన స్టేడియాన్ని నిర్మిస్తే వందల సంఖ్యలో క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదిగే అవకాశం ఉంది.

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లోనూ..

జిల్లా కేంద్రంతోపాటు ఇతర ప్రాంతాల్లోనూ క్రీడా మైదానాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నిజామాబాద్ నగర శివారులోని నాగారంలో ఉన్న రాజారాం స్టేడియం దశాబ్దకాలంగా శిథిలావస్థలో ఉంది. స్టేడియం ఉన్నా ఎవరూ పెద్దగా ఉపయోగించకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం ఆ స్టేడియం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. అలాగే ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్ మున్సిపాలిటీల పరిధిలో కూడా సరైన క్రీడా మైదానాలు లేవు. బోధన్, జక్రాన్‌పల్లి, వేల్పూర్, కమ్మర్పల్లిలో తూతూమంతంగా నిర్మించిన స్టేడియాలను గాలికొదిలేశారని క్రీడాభిమానులు అంటున్నారు.

హేమాహేమీలు క్రీడా ఓనమాలు దిద్దింది ఇక్కడే..

యెండల సౌందర్య, గుగులోత్ సౌమ్య వంటి హేమాహేమీలు పాత కలెక్టరేట్ మైదానంలోనే క్రీడా ఓనమాలు దిద్ది అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు. వీరితోపాటు పదుల సంఖ్యలో క్రీడాకారులు హాకీ, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, ఖోఖో, హ్యాండ్‌బాల్ తదితర క్రీడాంశాల్లో జాతీయస్థాయిలో రాణిస్తున్నారు. అరకొర వసతుల మధ్య కోచింగ్ పొందుతున్నవారు జిల్లాకు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో కీర్తి తెస్తున్నారు. ప్రస్తుత పాత కలెక్టరేట్ మైదానం సుమారు 6 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ స్థలంలో సింథటిక్ ట్రాక్‌తోపాటు స్టేడియాన్ని నిర్మించొచ్చు.


కలెక్టరేట్ మైదానంలో పుట్‌బాల్ ఆడుతున్న రేవంత్‌రెడ్డి (ఫైల్)

కోచ్‌లను నియమించాలి



అన్ని క్రీడలకు ముందుగా కోచ్‌లను నియమించాలి. కోచ్‌లు లేకపోవడంతో సరైన శిక్షణ లేకుండాపోతోంది. అరకొర వసతుల మధ్య క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడానికి ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వాలు మైదానాలను నిర్మిస్తే బాగుంటుంది.

– నాగరాజు, పుట్‌బాల్ కోచ్

మెరుగైన భవిష్యత్



చిన్నప్పటి నుంచే పాఠశాల విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇప్పించాలి. చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుంది. ప్రభుత్వాలు సైతం క్రీడారంగానికి పెద్ద పీట వేయాలి. జిల్లాలో స్టేడియం నిర్మిస్తే బాగుంటుంది. – శ్రీనివాస్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కబడ్డీ కోచ్

పనులు ప్రారంభించాలి



రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే క్రీడామైదానాన్ని నిర్మించడానికి నిధులు కేటాయించాలి. భూమి పూజ కూడా చేసి పనులు ప్రారంభిస్తేనే క్రీడాకారులకు నమ్మకం కలుగుతుంది. ఇప్పటికే చాలా ఆలస్యమైంది. – బొబ్బిలి నర్సయ్య, ఒలింపిక్ సంఘం జిల్లా కార్యదర్శి

పాలిసెట్‌కు సెక్షన్ 163 అమలు

ఖలీల్‌వాడి: ఈ నెల 13న జరిగే పాలిసెట్–2025కు జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్–163 సెక్షన్ అమలులో ఉంటుందని సీపీ పోతరాజు సాయి చైతన్య పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు 16 పరీక్షా కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా నిషేధాజ్ఞలు విధించామన్నారు. ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు పరీక్షా కేంద్రాల వద్ద గుమిగూడరాదన్నారు. నిషేధిత వస్తువులతో కేంద్రాల వద్ద తిరుగొద్దని, పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని ఆదేశించారు.

ఇళ్లలో కూర్చుని లబ్ధిదారుల ఎంపిక


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

- గ్రామసభలు లేకుండా ఎలా చేస్తారు..
- నిబంధనలు పాటించకుంటే కోర్టులను ఆశ్రయిస్తాం
- కాంగ్రెస్ కార్యకర్తలకే 'యువ వికాస్' అందించే యత్నం
- ధాన్యం సేకరణలో ప్రభుత్వానిది నిర్లక్ష్య వైఖరి
- బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్‌అర్బన్: కాంగ్రెస్ నాయకులు ఇళ్లలో కూర్చుని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేశారని, డబ్బులు ఇచ్చిన వారికే ప్రాధాన్యం ఇచ్చి అవినీతికి పాల్పడ్డారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జీవో నంబర్ 7 ప్రకారం గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉండగా, జిల్లాలో ఎక్కడా పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడి 17 నెలలు అయినా ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇళ్లు అందించలేదన్నారు. జిల్లాలో లక్షా 80వేల మంది పేదలు దరఖాస్తు చేసుకుంటే 70 వేల మందిని ఎంపిక చేశారని, నిబంధనల ప్రకారం అర్హులను ఎంపిక చేయాలని, లేనిపక్షంలో కోర్టులను ఆశ్రయిస్తామన్నారు. రాజీవ్‌యువవికాస్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు రూ.4 లక్షల వరకు రుణాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం.. కాంగ్రెస్ కార్యకర్తలనే అర్హులుగా గుర్తించి ఇవ్వబోతోందని ఆరోపించారు. వేల కోట్ల రూపాయలను కాంగ్రెస్ నేతలు జేబులు నింపుకునేందుకు ఈ పథకం తీసుకవచ్చినట్లు విమర్శించారు. గ్రామసభలు పెట్టకుండా నిర్వహించినట్లు అధికారులు రికార్డుల్లో రాస్తున్నారని దీనిపై ఉన్నతాధికారులకు విన్నవిస్తామన్నారు. జిల్లాలో ధాన్యం సేకరణ నత్తనడకన కొనసాగుతోందని, పదిలక్షల మెట్రిక్‌టన్నుల సేకరించాల్సి ఉండగా, ఏడు లక్షల 50 వేల మెట్రిక్ టన్నులు సేకరించారన్నారు. 17 వేల మెట్రిక్‌టన్నులను తరుగుకింద తీసివేస్తున్నారని, రైస్‌మిల్లర్లు దోచుకుంటున్నారని కలెక్టర్ దీనిపై ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వడం లేదన్నారు. సమావేశంలో జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సత్యప్రకాశ్, సూదం రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

సైనికులకు అండగా నిలబడాలి

- ఆపరేషన్ సిందూర్ సక్సెస్ అవుతుంది
- ఎంపీ అర్వింద్ ధర్మపురి


పూజలు చేస్తున్న ఎంపీ అర్వింద్ ధర్మపురి

నిజామాబాద్ రూరల్: దేశ ప్రజలంతా సైనికులకు అండగా నిలబడాలని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి అన్నారు. 'మనం సైతం – దేశం కోసం' నినాదంతో సారంగాపూర్‌లోని హనుమాన్ ఆలయంలో ఆదివారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పహల్గాంలో పర్యాటకులను పొట్టనపెట్టుకున్న ఉగ్రవాదుల అంతానికి భారత్ ఆపరేషన్ సిందూర్ ప్రారంభించినట్లు తెలిపారు. పాకిస్తాన్‌లో ఉన్న టెర్రరిస్టులను మట్టుపెట్టేందుకు ప్రధాని మోదీ అధ్యక్షతన నడుం బిగించినట్లు పేర్కొన్నారు. యుద్ధంలో పోరాడుతున్న సైనికులకు సంపూర్ణ ఆయురారోగ్యాలను కల్పించాలని, భగవంతుడు ఎల్లవేళలా అండగా ఉండాలని పూజలు చేశామన్నారు. ఆయన వెంట పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, బీజేపీ నాయకులు ఉన్నారు.

ఇబ్బందులు కలిగించకుండా నల్లమట్టి తరలించాలి


అన్నారంలో కొనుగోలు కేంద్రం వద్ద సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

డొంకేశ్వర్(ఆర్మూర్): ఎవరికీ ఇబ్బందులు, నష్టం కలిగించకుండా నల్ల మట్టి తరలించుకోవాలని, మట్టి రోడ్లపై పడితే ప్రమాదాలు జరుగుతాయని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన డొంకేశ్వర్ మండలంలో పర్యటించారు. మండల కేంద్రంలోని నికాల్‌పూర్‌కు వెళ్లే రోడ్డులో ఉన్న ఇరిగేషన్ కెనాల్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఇరుకుగా ఉన్న వంతెన స్థానంలో కొత్తది నిర్మించాలని, అలాగే మట్టి పూడికను తీయించాలని రైతులు సుదర్శన్‌రెడ్డిని కోరగా, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. అన్నారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి ఆయన బస్తాల రవాణాకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన అన్నారం మాజీ సర్పంచ్ పోశన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, ఎన్‌డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడిసెరం భూమేశ్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ భరత్‌రెడ్డి, లిఫ్ట కమిటీ చైర్మన్ భోజారెడ్డి, నాయకులు ఉన్నారు.

గాలివాన


శ్రీనగర్ శివారులో రోడ్డుపై విరిగిపడిన చెట్టు

వర్ని: ఉమ్మడి వర్ని మండలంలోని చందూర్, మోస్రా, వర్ని మండలాల్లో ఆదివారం మధ్యాహ్నం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. సుమారు అరగంటపాటు భారీ వర్షంతో పాటు ఈదురు గాలులు వీయడంతో శ్రీనగర్ శివారులో భారీ వృక్షం రోడ్డుపై పడిపోయింది. రోడ్డు మధ్యలో చెట్టు పడిపోవడంతో రాకపోకలకు గంటపాటు అంతరాయం ఏర్పడింది. స్థానికులు, వాహనదారులు కలిసి రోడ్డుపై పడిపోయిన చెట్టును తొలగించడంతో రాకపోకలు యథావిధిగా సాగాయి.

మొలకెత్తిన ధాన్యం


నాగంపేట్‌లో మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతు గంగాధర్

బాల్కొండ: అకాల వర్షాల కారణంగా అన్నదాత ఆగమవుతున్నాడు. ఉమ్మడి బాల్కొండ మండలంలోని పలుచోట్ల శనివారం రాత్రి వర్షం కురవడంతో పంట దిగుబడులు తడిసిముద్దయ్యాయి. నెలరోజులుగా ధాన్యం రోడ్డుపై ఆరబోస్తున్నానని, వర్షానికి తడిసి మొలకెత్తిందని ముప్కాల్‌మండలం నాగంపేట్ గ్రామానికి చెందిన రైతు ఏలేటి గంగాధర్ తెలిపాడు. గత నెల రోజులుగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటా కాక పోవడంతో ఆరబోసిన ధాన్యం శనివారం రాత్రి కురిసిన వర్షానికి నీటి పాలైంది. వారం రోజులుగా రోజువిడిచి రోజు వర్షం కురుస్తుండడంతో ధాన్యం మొలకెత్తింది. బస్తాల్లోని ధాన్యం సైతం మొలకెత్తుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కారణంగా మరో 15 రోజుల వరకు సజ్జ చేతికి వచ్చే అవకాశం లేదంటున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

క్లుప్తంగా

'అమ్మకు వినూత్న వందనం'



మోపాల్‌: మండలకేంద్రంలోని చిన్నారులు ఆదివారం మదర్స్‌ డే సందర్భంగా అమ్మకు వినూత్నంగా శుభాకాంక్షలను తెలియజేశారు. చిన్నారులు గ్రామస్తులతో కలిసి చెట్ల ఆకులతో 'అమ్మకు వందనం' అని లిఖించి మాతృమూర్తులకు శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో ప్రతిఒక్కరికి తొలి గురువు అమ్మేనని, తల్లి ప్రేమను మించినది ఈ సృష్టిలో ఏదీ లేదని చిన్నారులు అన్నారు. కార్యక్రమంలో నవీన్‌ రెడ్డి, ముత్యం, గంగాధర్‌, శేఖర్‌, సంజీవ్‌రెడ్డి, చిన్నారులు అక్షర, ఆకృతి, ఖుషి, చిన్ను, కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

అమీర్‌నగర్‌ వాసికి ఉత్తమ షార్ట్‌ ఫిల్మ్‌ డైరెక్టర్‌ అవార్డు



కమ్మర్‌పల్లి: మండలంలోని అమీర్‌నగర్‌ గ్రామానికి చెందిన మెరుగు నాగేశ్వర్‌రావు అనే వ్యక్తికి ఉత్తమ షార్ట్‌ ఫిల్మ్‌ డైరెక్టర్‌ అవార్డు దక్కింది. ఎంఎన్‌ఆర్‌ ప్రొడక్షన్‌ బ్యానర్‌పై నాగేశ్వర్‌రావు 'మన రసం' అనే షార్ట్‌ ఫిల్మ్‌ నిర్మించి దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి కథ, మాటలు రాసి భరత్‌ అనే లీడ్‌ రోల్‌ పోషించారు. రెండు నెలల క్రితం యూట్యూబ్‌లో విడుదల చేశాయగా భారీ వ్యూస్‌తో వీక్షకుల మన్నలను పొందింది. ఈ చిత్రానికి జోష్‌ ఇంటర్నేషనల్‌ ఫిల్మ్‌ ఫెస్టివల్‌లో ఉత్తమ షార్ట్‌ ఫిల్మ్‌ డైరెక్టర్‌ అవార్డు దక్కింది. ఇటీవల హైదరాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నిర్వహించిన ఫిల్మ్‌ ఫెస్టివల్‌లో రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్‌ చైర్మన్‌ పురుషోత్తం చేతుల మీదుగా నాగేశ్వర్‌ రావు బెస్ట్‌ షార్ట్‌ ఫిల్మ్‌ డైరెక్టర్‌ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా జోష్‌ ఇంటర్నేషనల్‌ ఫిల్మ్‌ ఫెస్టివల్‌ అధినేత సంజోష్‌ తగరంకు, జ్యూరీ సభ్యులకు నాగేశ్వర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

రెడ్‌క్రాస్‌ జిల్లాకు గర్వకారణం



నిజామాబాద్‌నాగారం: సమాజ సేవలో ముందుంటూ ప్రగతి సాధిస్తున్న జిల్లా రెడ్‌క్రాస్‌ సంస్థ జిల్లాకే గర్వకారణమని బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. విద్యుత్‌ శాఖ ఏడీఈ తోట రాజశేఖర్‌కు రెడ్‌క్రాస్‌ లో రాష్ట్రపతి అవార్డు దక్కడంతో ఆదివారం బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌ రెడ్డి ఆయనను సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సమాజం కోసం సేవలు అందించాలని అప్పుడే అభివృద్ధికి బాటపడుతుందన్నారు. రాజశేఖర్‌ ఇటు వృత్తిలోనూ అటు సేవారంగంలోనూ ముందుంటూ ఆదర్శంగా నిలుస్తున్నాడని ప్రశంసించారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌ బిన్‌ హందాన్‌, రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషన్‌ సభ్యుడు గడుగు గంగాధర్‌, రాష్ట్ర సహకార సమాఖ్య లిమిటెడ్‌ చైర్మన్‌, జిల్లా డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌ రెడ్డి, జిల్లా సహకార బ్యాంకు చైర్మన్‌ రమేష్‌రెడ్డి, జిల్లా రెడ్‌క్రాస్‌ చైర్మన్‌ బుస్సా ఆంజనేయులు, కోశాధికారి కరిపే రవీందర్‌, జూనియర్‌ రెడ్‌క్రాస్‌ జిల్లా సమన్వయకర్త రవీందర్‌ అబ్బాపూర్‌, నాయకులు ప్రవీణ్‌ రెడ్డి, మైపాల్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్‌ కేసు నమోదు

నిజామాబాద్‌రూరల్‌: మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో ఆదివారం ముగ్గురు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్‌ కేసు నమోదు అయినట్లు రూరల్‌ ఎస్‌హెచ్‌వో మహ్మద్‌ఆరీఫ్‌ తెలిపారు. వివరాలు ఇలా.. తిర్మన్‌పల్లి గ్రామంలో బోనాలపండుగ నిర్వహిస్తున్న సందర్భంగా గ్రామంలో ఉన్న ఎస్టీలకు ఇతర ప్రజలకు మాటమాట పెరిగి తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో తిర్మన్‌పల్లి గ్రామస్తుల ఎస్సీ, ఎస్టీ వర్గాల ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

సాగరతీరంలో.. అందాల కనువిందు



డొంకేశ్వర్‌ మండలం జీజీ నడ్కుడ, గాదేపల్లి, చిన్నయానం, అన్నారం, సిర్పూర్‌ పరిధిలోని శ్రీరాంసాగర్‌ బ్యాక్‌ వాటర్‌ ప్రాంతం ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్న ఈ అందమైన ప్రదేశాల చిత్రాలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది. – డొంకేశ్వర్‌









క్రైం కార్నర్‌

ఇరువర్గాల ఘర్షణ: పలువురికి గాయాలు

- సమాచారం ఇచ్చినా స్పందించని పోలీసులు



వర్ని: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం జరిగిన ఇరు వర్గాల మధ్య ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. ఘర్షణపై పోలీసులకు సమాచారం ఇచ్చిన స్పందించలేదని స్థానికులు తెలిపారు. వివరాలు ఇలా.. వర్నిలో ఆదివారం సాయంత్రం రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈఘటనపై ఇరువురి వాహనదారుల మధ్య మాటామాట పెరిగి చివరకి అంతాపూర్‌, తగిలేపల్లి గ్రామస్తుల మధ్య ఘర్షణగా మారింది.సుమారు గంటన్నరపాటు ఇరువర్గాలు తోపులాట, తిట్టుకోవడం, కొట్టుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి. సుమారు గంటన్నర నుంచి పోలీసులకు, డయల్‌ 100కు ఫోన్‌ చేసిన స్పందించలేదని స్థానికులు మండిపడుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



రుద్రూర్‌: పోతంగల్‌ మండలం కొడిచర్ల శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు నిఘా వేయగా ట్రాక్టర్‌ పట్టుబడింది. ఈ ట్రాక్టర్‌ను కోటగిరి పోలీస్‌స్టేషన్‌ తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సునీల్‌ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ చోరీ



బాన్సువాడ రూరల్‌: మండలంలోని ఇబ్రాహింపేట్‌ గ్రామానికి చెందిన బండిసాయిలు అనే రైతు పొలంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు ధ్వంసం చేసి కాయిల్‌ చోరీచేశారు. సుమారు రూ.40వేల నష్టం వాటిల్లినట్లు ట్రాన్స్‌కో రూరల్‌ ఏఈ కిరణ్‌కుమార్‌ తెలిపారు. ప్రస్తుతం వరికోతలు పూర్తికావడంతో రైతులు పొలాలవైపు వెళ్లకపోవడంతో దొంగతనాలు చోటుచేసుకుంటున్నాయని ట్రాన్స్‌కో అధికారులు పేర్కొంటున్నారు.

29 క్వింటాళ్ల రేషన్‌ బియ్యం పట్టివేత



నవీపేట: నిజామాబాద్‌ నుంచి ధర్మాబాద్‌ వైపు అక్రమంగా తరలిస్తున్న రేషన్‌ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై వినయ్‌ ఆదివారం తెలిపారు. టాటాఏస్‌ వాహనంలో బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారని ఫిర్యాదు రావడంతో నవీపేట శివారులో పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డీటీ మహేష్‌కుమార్‌కు అప్పగించామన్నారు. నిజామాబాద్‌లోని మాలపల్లికి చెందిన వాహన యజమాని షేక్‌ ఖయ్యూమ్‌, డ్రైవర్‌ సాఫియాన్‌లపై కేసు నమోదు చేశామన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నందిపేట్‌(ఆర్మూర్‌): మండలంలోని చింరాజ్‌పల్లి గ్రామ శివారులోగల తోట గణేష్‌ అనే వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం సుమారు 40 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యమయింది. వడదెబ్బ తగిలి సుమారు రెండు మూడు రోజుల క్రితమే అతడు మరణించి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని నిజామాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. మృతుడి ఒంటిపై బ్లూ కలర్‌ జీన్స్‌ ప్యాంట్‌, కాఫీ కలర్‌ టీషర్టు ఉన్నదని, సంబంధీకులు ఎవరైన ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రమాదం కాదు.. హత్యే..

- భర్తను ప్రియుడితో కలిసి హతమార్చిన భార్య
- దాబా పైనుంచి పడి చనిపోయాడని నమ్మించిన వైనం
- కుమారుడి ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు



వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

మాక్లూర్‌: వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని భావించి భర్తను ప్రియుడితో కలిసి భార్య హతమార్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మొదట దాబా పైనుంచి పడి చనిపోయాడని నమ్మించి అంత్యక్రియలు పూర్తి చేయగా, కుమారుడి ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపట్టగా హత్య విషయం తెలిసింది. కేసు వివరాలను ఆదివారం నార్త్‌ జోన్‌ సీఐ శ్రీనివాస్‌ మాక్లూర్‌ ఎస్సై రాజశేఖర్‌ వెల్లడించారు. మాక్లూర్‌ మండలం కల్లెడి తండాలో ఈ నెల 5న రాత్రి గూగులోత్‌ శంకర్‌ దాబా పైనుంచి పడి మృతి చెందాడని భార్య యమున నమ్మించింది. మరుసటి రోజు అంత్యక్రియలు సైతం పూర్తిచేశారు. ఈ విషయమై మృతుడి కుమారుడు గూగులోత్‌ రమేష్‌ తండ్రి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఈనెల 10 మాక్లూర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై రాజశేఖర్‌ వెంటనే విచారణ ప్రారంభించి యమునను అదుపులోకి తీసుకుని విచారించగా, హత్య చేసినట్లు నేరం ఒప్పుకున్నారు. 5వ తేదీ రాత్రి తన ప్రియుడు నందుతో కలిసి భర్త శంకర్‌ను దాబా పైనుంచి తోసివేసింది. అనంతరం కర్రతో కొట్టి గొంతు నులిమి హత్య చేశారు. దీంతో భార్య, ఆమె ప్రియుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



ప్రణీత మృతదేహం

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్‌ ఫ్యాక్టరీ సమీపంలోగల 44వ నంబర్‌ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఎస్సై రంజిత్‌ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదిలాబాద్‌ జిల్లా జైనథ్‌ మండలం కంఠం గ్రామానికి చెందిన అముల్‌ నేవీలో విశాఖపట్నంలో ఉద్యోగం చేస్తున్నాడు. పాక్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో సెలవులు రద్దు కావడంతో భార్య బోయర్‌ ప్రణీత(19)తో కలిసి ఆదివారం సాయంత్రం కారులో విశాఖపట్నం బయలుదేరాడు. అడ్లూర్‌ ఎల్లారెడ్డి శివారులో వీరి వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న రెయిలింగ్‌ను ఢీకొని బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ప్రణీతకు తీవ్ర గాయాలు కాగా అముల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే వారిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రణీత మృతి చెందింది. అముల్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

ఆర్మూర్‌లో ఒకరి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆర్మూర్‌ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్‌ తెలిపారు. వివరాలు ఇలా.. పట్టణంలోని గుడ్ల ప్రవీణ్‌(35) పుసవర్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగ వ్యాపారంలో నష్టం రావడంతో అప్పులు అయినట్లు శనివారం భార్యకు ఫోన్‌ చేసి తాను చనిపోతున్నట్లు చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు ఎంత గాలించిన అతడి ఆచూకీ తెలియలేదు. ఆదివారం ఉదయం రాజారాం నగర్‌ స్మశాన వాటికలో చెట్టుకు ఉరివేసుకొని కనిపించాడు. వెంటనే స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

బోనాల్‌ గ్రామానికి చెందిన యువతి..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బోనాల్‌ గ్రామానికి చెందిన ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన కుచలకంటి సుచరిత(22) బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లోని గండిమైసమ్మ ప్రాంతానికి వెళ్లి నివాసం ఉంటున్నారు. గత కొంతకాలం క్రితం సుచరిత తల్లిదండ్రులు స్వగ్రామం బోనాల్‌కు తిరిగి వచ్చారు. సుచరిత అక్కడే ప్రయివేటు కంపెనీలో పని చేసుకుంటూ ఉంటుంది. శనివారం రాత్రి సుచరిత నివాసం ఉంటున్న ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోగా, స్థానికులు ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు హైదరాబాద్‌కు వెళ్లి కూతురు మృతదేహాన్ని చూసి, బోరున విలపించారు. సుచరిత ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణం అని తెలిసింది. సుచరిత ఆత్మహత్యకు కారణమైన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఎప్‌సెట్‌ ఫలితాల్లో జిల్లా విద్యార్థుల సత్తా



ఉత్తమ విద్యార్థులను అభినందిస్తున్న ఎస్‌ఆర్‌ కళాశాల యాజమాన్యం

నిజామాబాద్‌అర్బన్‌: ఎప్‌సెట్‌ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఆదివారం ఫలితాలు విడుదల కాగా, పలువురు విద్యార్థులు ఇంజినీరింగ్‌, అగ్రికల్చర్‌ విభాగాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. నగరంలోని నారాయణ జూనియర్‌ కళాశాలకు చెందిన హర్షిత్‌కు అగ్రికల్చర్‌ విభాగంలో 1314 ర్యాంకు, నిహాల్‌కు 2553 ర్యాంకు వచ్చింది. పదివేల లోపు పదిర్యాంకులు, 20వేలలోపు 26 ర్యాంకులను తమ విద్యార్థులు సాధించినట్లు ఏజీఎం లక్ష్మారెడ్డి అన్నారు.

కాకతీయ కళాశాలలో..



అనస్‌అలీ 1766 ర్యాంకు



ఎం సంకీర్త్‌ 2398 ర్యాంకు



జి వేదస్మర్‌ 2881 ర్యాంకు

జిల్లా కేంద్రంలోని కాకతీయ జూనియర్‌ కళాశాల విద్యార్థులు అనస్‌అలీ 1766 ర్యాంకు(అగ్రికల్చర్‌), ఎం.సంకీర్త్‌ 2398 , జి.వేదస్మర్‌ 2881, భవ్యశ్రీ 3310, ఎం.లోకేశ్‌ 3671, ఏ.వైష్ణవి 4172, రిషిక్‌ 5932, వి.నికేతన్‌ 6293 ర్యాంకులు సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్‌ రామోజీరావు సన్మానించారు. కళాశాల డైరెక్టర్‌ తేజస్విని, ప్రిన్సిపల్‌ సందీప్‌, రణదీప్‌, శ్యామ్‌ పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ కళాశాలలో..

నగరంలోని ఎస్‌ఆర్‌ కళాశాల విద్యార్థులు కార్తీక్‌ 572 ర్యాంకు, విష్ణువర్ధన్‌ 689 ర్యాంకు (అగ్రికల్చర్‌), అతీఫ్‌అఫ్‌నాన్‌ 1305 (అగ్రికల్చర్‌), నవదుర్గ 1484 (ఇంజనీరింగ్‌), శ్రీకాంత్‌ 1611(అగ్రికల్చర్‌), తేజస్విని 1914(అగ్రికల్చర్‌), జి.సిరి 2117(అగ్రికల్చర్‌), రాజశ్రీ 2175 ర్యాంకు (అగ్రికల్చర్‌) సాధించారు. విద్యార్థులను కళాశాల ఏజీఎం గోవర్ధన్‌రెడ్డి సన్మానించారు.

వెక్టార్‌ జూనియర్‌ కళాశాలలో..

నగరంలోని వెక్టార్‌ జూనియర్‌ కళాశాల విద్యార్థులు శ్రీవర్షిణి 1316 ర్యాంకు, మామిడి నిశాంత్‌రెడ్డి 1737, చంద్రవన్‌రెడ్డి 2532, వినాయక్‌ జోషి 2660, ఆర్గుల్‌ వెన్నెల 3554 ర్యాంకు సాధించారు. విద్యార్థులను కళాశాల చైర్మన్‌ మధుసూదన్‌జోషి అభినందించారు.

క్షత్రియ జూనియర్‌ కళాశాలలో..

పెర్కిట్‌(ఆర్మూర్‌): ఆర్మూర్‌ మండలం చేపూర్‌ క్షత్రియ జూనియర్‌ కళాశాల విద్యార్థులు వివేక్‌రెడ్డి 1,813 ర్యాంకు (ఇంజనీరింగ్‌), హరివర్షిని 3,724 ర్యాంకు (అగ్రికల్చర్‌ అండ్‌ ఫార్మసీ) సాధించినట్లు ప్రిన్సిపల్‌ నాగేశ్వర్‌ రావు తెలిపారు.

పెన్షన్‌ ఉద్యోగుల ప్రాథమిక హక్కు



నిజామాబాద్‌ నాగారం: పెన్షన్‌ ప్రభుత్వ భిక్ష కాదని, ఉద్యోగుల ప్రాథమిక హక్కు అని, దానిని కాలరాసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని ఇన్సూరెన్స్‌ ఉద్యోగుల జాతీయ నాయకుడు జీ తిరుపతయ్య అన్నారు. ఎంప్లాయిస్‌ స్టడీ సర్కిల్‌ ఆధ్వర్యంలో పెన్షనర్స్‌ అండ్‌ సీనియర్‌ సిటిజన్‌ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. ఈపీఎస్‌, న్యూ పెన్షన్‌ స్కీం, యూనిఫైడ్‌ పెన్షన్‌ స్కీమ్‌, కొత్త పెన్షనర్లు, పాత పెన్షనర్లంటూ వర్గీకరించి పెన్షన్‌ను ఎగవేసేందుకు ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యోగ, కార్మికులు పోరాటం చేస్తున్నారని, అందులో భాగంగానే ఈ నెల 20న సమ్మెకు పూనుకున్నట్లు తెలిపారు. జేఏసీ జిల్లా చైర్మన్‌ నాశెట్టి సుమన్‌, స్టడీ సర్కిల్‌ జిల్లా కన్వీనర్‌ రామ్మోహన్‌రావు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు వెంకటేశ్‌ , ఈవిల్‌ నారాయణ, నేతి శేఖర్‌, శ్రీనివాసరావు, విజయానందరావు, ఎల్‌ శ్రీధర్‌, మదన్‌ మోహన్‌ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల తర్వాత కలిసిన బాల్య మిత్రులు

- జిల్లాలో పలుచోట్ల ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించిన పూర్వవిద్యార్థులు
- ఆత్మీయ పలకరింపులతో భావోద్వేగానికిలోనైన స్నేహితులు

సాక్షి నెట్‌వర్క్‌: చిన్ననాటి మిత్రులందరూ దశాబ్దాల తర్వాత మళ్లీ ఒక్కచోటికి చేరడంతో హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలోని వివిధ గ్రామాల ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నానాటి మిత్రులందరూ ఏళ్ల తర్వాత మళ్లీ ఒకే వేదికపై కలుసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. అరే ఎన్నాళ్లయింది కలుసుకుని.. పూర్తిగా మారిపోయావంటూ ఆనాటి స్నేహితులు ఆత్మీయ పలకరింపులు.. ఆపాత మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకుని భావోద్వేగానికి గురయ్యారు. నాడు చదువు నేర్పిన ఉపాధ్యాయులను సమ్మేళనానికి ఆహ్వానించి, సన్మానించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం విద్యార్థులు, గురువులు అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.



కోటగిరిలోని అరవింద విద్యానికేతన్‌ పాఠశాల 1999-2000 ఎస్సెస్సీ బ్యాచ్‌ విద్యార్థులు



ఖలీల్‌వాడి జెడ్పీ ఉన్నత పాఠశాల 1973-74 ఎస్సెస్సీ బ్యాచ్‌ విద్యార్థులు



నందిపేటలోని నంది ప్రగతి హైస్కూల్‌ 1999-2000 ఎస్సెస్సీ బ్యాచ్‌ విద్యార్థులు



ఆలూర్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ 1985-86 ఎస్సెస్సీ బ్యాచ్‌ విద్యార్థులు





కమ్మర్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌ 1995-96 ఎస్సెస్సీ బ్యాచ్‌ విద్యార్థులు, 2000-01 ఎస్సెస్సీ బ్యాచ్‌ విద్యార్థులు



నవీపేటలోని మాధవ విద్యానికేతన్‌ పాఠశాల 1999-2000 ఎస్సెస్సీ బ్యాచ్‌ విద్యార్థులు



వేల్పూర్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ 1999-2000 ఎస్సెస్సీ బ్యాచ్‌ విద్యార్థులు